క్లుప్తంగా

వేడుకగా జల్సాయే దాస్తార్ బందీ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్యాంనగర్‌లోని మదరసా అరబియా మిస్బాహుల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జల్సాయే దాస్తార్ బందీ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఫీజ్ అంజాద్‌బాషా సిద్ధిఖీ, సయ్యద్ అజ్మతుల్లా మాట్లాడుతూ ఈకా మదరసాలో 10 మంది విద్యార్థులు ఖురాన్ పఠనం కంటస్థం చేయడంతో వారికి గౌరవ సూచికంగా దాస్తార్ బందీ సర్టిఫికెట్లను అందజేసి బహుమతులు ప్రదానం చేశామని చెప్పారు.

నిరసన ర్యాలీ

నంద్యాల(వ్యవసాయం): పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అత్యాచారాలను ఖండిస్తూ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, మహిళా మోర్చా అధ్యక్షురాలు స్వాతి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులతో నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ మహిళలపై జరిగిన అత్యాచారాలను నిరసిస్తూ నారీశక్తివందన్ పేరుతో టౌన్‌హాల్ నుంచి 2కే రన్‌ఫర్ నేషన్, రన్ ఫర్ మోడీ 2కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వణిత శ్రీనివాస్, నిర్మల, గీతామాధురి, డాక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ రఘురాం అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం మండలంలోని హరివరం గ్రామానికి ఉయ్యాలవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది 104 వాహనంలో చేరుకుని స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సాయంత్రం అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు, గృహాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు ఉన్నారు.

ఇంటర్ పరీక్షల తనిఖీ

చాగలమర్రి: స్థానిక ఎస్‌వీఎంవీఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షను జిల్లా సిట్టింగ్ స్క్వాడ్ అధికారి మురళీమోహన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు కాపీయింగ్‌కు గాని, మాస్ కాపీయింగ్ పాల్పడి, పట్టుబడితే డి చేస్తామని హెచ్చరించారు. మండలంలోని బర్న్స్, మహర్షి, ఎం.ఎ, కస్తూర్బా, ఎస్‌వీ జూనియర్ కళాశాలలకు సంబంధించి సుమారు 307 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిసి ఉండగా 15మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా అనురాధ, చీఫ్ సూపరింటెండెంట్ పీరయ్య విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ - క్రాప్ జాబితా సరిచూసుకోవాలి

గోస్పాడు: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాలకు సంబంధించిన ఈ- క్రాప్ జాబితాను సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా 2023-24 రబీ సీజన్‌కు సంబంధించిన ఈ- క్రాప్ ముసాయిదా జాబితాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని సీకరిస్తామని, ఇందుకు ఆర్బీకే స్థాయిలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8వ తేదీన తుది జాబితాను ప్రదర్శిస్తారని, సవరణలకు ఇదే చివరి అవకాశమని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో చేరిన పశు వైద్య సహాయకులు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పశు వైద్య సహాయకులు సోమవారం విధుల్లో చేరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వం ఇటీవల కొందరు యువతను పశు వైద్య సహాయకులుగా నియమించింది. ఇందులో భాగంగా మండలానికి ఆరుగురిని నియమించగా నలుగురు విధుల్లో చేరారు. వారిలో ఆలమూరుకు శ్రీ వాణి, చిన్నకంబలూరుకు ప్రవీణ్‌కుమార్, పెద్దకంబలూరులకు పెద్ద కొండయ్య, రుద్రవరం-1 సచివాలయానికి ఖలీల్‌బాషా విధులకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల: జగనన్న ధైర్యానికి, నాయకత్వానికి, పారదర్శక పాలనకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీ వైపు రావడం సంతోషంగా ఉందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీడీపీ, జనసేన నుంచి పట్టణంలోని 3, 5 వార్డులకు చెందిన బిలాల్, జాకీర్, అక్రమ్, సోహెల్, మున్నా, హుసేన్ ఖాన్, మహమ్మద్ రఫీ, షంషుద్దీన్, ఫారుక్, జాఫర్, మాబాషాతో పాటు 120 కుటుంబాలు ఆయా వార్డుల కౌన్సిలర్లు సమ్మద్, ఆరిఫ్ నాయక్, బషీద్, పైలట్, అఖిల్, కరీముల్ల, మబాషా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత పార్టీలోకి వెల్లువలా తరలి వస్తుంటే రానున్న ఎన్నికల్లో జగనన్న ప్రభంజనం ముందే తెలుస్తుందన్నారు. కేవలం వ్యక్తిగత అజెండాలతో టీడీపీ, జనసేన ఎన్నికలకు వస్తున్నాయని గ్రహించారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.





ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు

పోస్టల్ ఎల్ఐసీపై అవగాహన

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాల, తెలుగుగంగ కార్యాలయంలో సబ్ పోస్టుమాస్టర్ ప్రభాకర్‌రెడ్డి, పోస్టల్ అసిస్టెంట్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టల్ ఎల్ఐసీపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పోస్టల్ ఎల్ఐసీలో ప్రీమియం తక్కువ, బోనస్ ఎక్కువగా వస్తుందన్నారు. పొదుపుతో పాటు బీమా పొందే సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఈ పథకానికి డిగ్రీ, డిప్లొమా అర్హత కలిగిన వారు, కాంట్రాక్టు ఉద్యోగులు అర్హులని చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

ఆళ్లగడ్డ: ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన ఓ వ్యక్తికి మేజిస్ట్రేటు జైలుశిక్ష విధించినట్లు సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. స్థానిక పాతబస్టాండు ప్రాంతంలో ఎస్ఐలు వెంకటరెడ్డి, నగీనా తనిఖీ చేస్తుండగా సుమిత్రబాబు అనే వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడటంతో ఆళ్లగడ్డ కోర్టు ఇన్‌చార్జ్ అయిన కోవెలకుంట్ల మేజిస్ట్రేటు ఆయనకు నెల జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చాగలమర్రి: త్వరలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి యువత కృషి చేయాలని పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు వి.మహబూబ్ షరీఫ్ సూచించారు. మండలంలోని చిన్నవంగలి, పెద్దవంగలి, చింతల చెరువు గ్రామాల్లో సోమవారం యువతతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపుకోసం సైనికుల్లా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. పెద్దవంగలి గ్రామ సర్పంచ్ బంగారు షరీఫ్, ప్రచారకార్యదర్శి పెయింటర్ షరీఫ్, పీఎంసీ చైర్మన్ అబ్దుల్లా, నాయకులు బబ్లూషోయబ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పెద్దవంగలిలో మాట్లాడుతున్న వి.షరీఫ్

మున్సిపల్ స్పందనకు రెండు వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు రెండు వినతులు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ ఒకటి కచ్చా డ్రైన్ స్థానంలో సీసీ కాల్వ నిర్మాణం చేయాలని, మరొకటి రోడ్డుపై అక్రమంగా నిర్మించిన టాయిలెట్‌ను తొలగించాలని ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వాటికి త్వరగా పరిష్కారం చూపుతామన్నారు.

నంద్యాలకు నీటి ఎద్దడి రానివ్వం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): నంద్యాల ప్రజల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డు శ్రీనివాస నగర్‌లో రూ.1.81 కోట్లతో 6లక్షల లీటర్ల నీటి స్టోరేజ్ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణ ప్రజలకు రానున్న కాలంలో ఎలాంటి నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇటీవల అమృత్ -2 ప్రాజెక్టును వెలుగోడు నుంచి నంద్యాలకు నీటిని సరఫరా చేసేందుకు రూ.158 కోట్లతో నిర్మించామన్నారు. అమృత్ - 2.0 నిర్మాణానికి మరో రూ.174కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం రూ.14.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. వైస్ చైర్మన్ పాంషావలి, మిద్దె రఘురాం, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సలాముల్ల దేశం సుధాకర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వెంకటేశ్వరస్వామి, రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్యశ్రీ

ఉయ్యాలవాడ : పేదల ఆరోగ్యానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ కార్డులు భరోసాగా నిలుస్తాయని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచిందని చెప్పారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మొదటి విడతగా హరివరం గ్రామ సచివాలయానికి 480 కార్డులు, ఆర్.జంబులదిన్నెకు 518, కొండుపల్లె 434, ఇంజేడు 541, మాయలూరు 531, పెద్దయమ్మనూరు 350, సుద్దమల్ల 376, బోడెమ్మనూరు 219, ఉయ్యాలవాడ గ్రామ సచివాలయానికి 713 కార్డులు వచ్చాయన్నారు. వీటిని ఆయా గ్రామాలలో వలంటీర్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ స్పష్టం చేశారు.



కార్యదర్శులకు ఆరోగ్య శ్రీ కార్డులను అందజేస్తున్న ఎంపీడీఓ

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

దొర్నిపాడు: మండలంలోని అన్ని సచివాలయాలకు నూతన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి ప్రస్తుతం 6,800 కార్డులు వచ్చాయని వెంటనే ఆయా సచివాలయాలకు అందజేశామన్నారు. వలంటీర్లు గ్రామ వార్డు సచివాలయం యాప్‌లో లబ్ధిదారులకు అందజేసి అథెంటికేషన్ తీసుకోవాలని సూచించారు. నూతన కార్డుల ద్వారా ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం రూ.25లక్షలకు పెంచిందని చెప్పారు. సర్పంచ్ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఎన్ఎం మాణిక్యమ్మ, ఇంజినీరింగ్ అసిసెంట్ ఉజ్మా, మహిళా పోలీస్ ఉశేనమ్మ, వీఏఏ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తోనే పథకాల వర్తింపు



రబీ ఈ-క్రాప్ వివరాలను ప్రదర్శిస్తున్న అధికారులు

దొర్నిపాడు: సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏడీఏ సుధాకర్ సూచించారు. సోమవారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో 2023-2024 ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో ఏమైనా తప్పులుంటే రైతులు వెంటనే వైఎస్సార్‌రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత పంటల బీమా, పంటనష్ట పరిహారం, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ వంటి పథకాలు అందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. ఏఓ సునీత, వీఏఏ వంశీకృష్ణ ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో కరెంట్ బిల్లు బకాయి చెల్లించమని అడిగినందుకు కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న మురళిని ఎన్‌జీవోస్ కాలనీలో కరెంట్ బిల్లులు చెల్లించని ఇళ్లు, షాపులవద్దకు వెళ్లి విద్యుత్ కనెక్షన్ తొలగించాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో ప్రైవేట్ హాస్టల్ విద్యుత్ కనెక్షన్ తొలగిస్తుండగా నిర్వాహకుడు రాజేష్ అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య తోపులాట జరిగిన కొంత సేపటికి రాజేష్ హాస్టల్‌లో ఉన్న కత్తితో మురళిపై దాడి చేశాడు. దీంతో మురళి బొటనవేలికి స్వల్ప గాయమైంది. విషయం తెలుసుకున్న విద్యుత్ ఉద్యోగులు రాజేష్‌పై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహానందికి బ్రహ్మోత్సవ శోభ

- రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- రోజూ వాహనసేవలు, గ్రామోత్సవాలు
- 9న లింగోద్భవం, కల్యాణోత్సవం
- 10న రథోత్సవం, 11న తెప్పోత్సవం

మహానంది: ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 6న మధ్యాహ్నం అంకురార్పణ, కలశస్థాపన, సాయంత్రం ధ్వజారోహణం పూజలు ఉంటాయన్నారు. అదే రోజు రాత్రి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు మయూరవాహనంపై గ్రామోత్సవం ఉంటుందన్నారు. 7న ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి రావణ వాహనసేవ ఉంటాయని చెప్పారు. 8న ఉదయం స్వామి, అమ్మవార్లకు శేషవాహనసేవ, రాత్రి నంది వాహనసేవ, అదేరోజు మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ మహానందీశ్వరస్వామివారికి రాత్రి పది గంటల నుంచి మహారుద్రాభిషేకం అత్యంత వైభవంగా జరిపిస్తామన్నారు. 9న తెల్లవారుజామున మూడు గంటల నుంచి కల్యాణోత్సవం, ఉదయం సింహవాహనసేవ, పుష్ప పల్లకీసేవలు ఉంటాయని పేర్కొన్నారు. 10న ఉదయం గజవాహనసేవ, మధ్యాహ్నం మూడు గంటలకు మహారథోత్సవం, రాత్రి పుష్పశయనోత్సవం పూజలు జరుగుతాయన్నారు. 11వ తేదీన మహాపూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజ అవరోహణం, బ్రహ్మోత్సవ యాగఫల సమర్పణం పూజలు శాస్త్రోక్తంగా చేస్తామని, రాత్రి రుద్రగుండం కోనేరులో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

ఇళ్ల స్థలాల ధ్రువ పత్రాల పంపిణీ



పట్టాలను పంపిణీ చేస్తున్న నాగినిరవి సింగారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇళ్లు కల్పించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని 36వ వార్డు కౌన్సిలర్ నాగినిరవి సింగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సచివాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇక నుంచి స్థలాలపై వారికి సర్వ హక్కులు లభిస్తాయని చెప్పారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వీఓఏల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీ వెలుగు వీఓఏల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మిట్నాల తిరుపతయ్య, నందిపల్లె సోమన్న కోరారు. సోమవారం నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. భాస్కర్, పుల్లయ్య, రోజులిన్, అల్లీపీర, సులోచన పాల్గొన్నారు.



అష్టవిధ మహామంగళహారతుల సమయంలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మహానంది: క్షేత్రంలో భక్తజన సందడి కొనసాగుతుంది. శివరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండటంతో పాటు శ్రీశైలం ఆలయానికి వెళ్లే భక్తులు, తిరుగు ప్రయాణంలో మహానందిని దర్శించుకుంటుండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. వేలాది సంఖ్యలో హాజరైన భక్తులతో సందడిగా కనిపిస్తుంది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వినాయకనంది, గరుడనంది ఆలయాలతో పాటు రాతినంది, పెద్దనంది ప్రాంతాలను తిలకించారు.

అయిన వారు లేకపోయినా..ఆదుకున్న ప్రభుత్వం

ఒకరు తల్లిదండ్రులను కోల్పోయి మానసిక వ్యాధితో అల్లాడుతుంటే.. మరో మహిళ ఎక్కడి నుంచో వచ్చి మానసిక స్థితి సరిగా లేక రోడ్ల వెంట తిరుగుతోంది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఉంటున్న రామలక్ష్మి, మొలక శ్రీనివాసరెడ్డికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచి మరొకరికి భారం కాకుండా సంక్షేమ పథకాలు అందజేసి ఆదుకుంది : దొర్నిపాడు



రామలక్ష్మికి పింఛన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ బాల ఓబులేసు



శ్రీనివాసరెడ్డికి పింఛన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ మహేశ్వరి

ఎవరీ రామలక్ష్మమ్మ?

చేతిలో కర్ర, సంకలో బట్టల మూట్ల పెట్టుకొని వెళ్తున్న రామలక్ష్మ కోస్తా నుంచి వచ్చిందని స్థానికులు అనుకుంటున్నారు. ఆమె యాస, బాషా అలాగే ఉంటాయి కావున. పెళ్లయ్యింది లేదో తెలియదు..అయిన వారెవరనేది తెలియకపోయినా అర్హత ఉండటంతో ఆమెకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉండటంతో పింఛన్ ఇస్తుంది జగనన్న ప్రభుత్వం. చిరునామా క్రిష్టిపాడులో ఉన్నప్పటికీ ఉయ్యావాడ మండలం హరివరంలో పింఛన్ మ్యాప్ అయ్యింది. వైఎస్సార్ పింఛన్ కానుక ఐడీ:11300029143 ద్వారా ప్రతి నెల వచ్చే రూ.3వేల పింఛన్ సొమ్మును తన వద్దే భద్రపరుస్తున్నాడు వలంటీర్ బాల ఓబులేసు. గ్రామంలోని ఓ హోటల్ వద్ద ఆమెకు రోజూ టిఫిన్ పెట్టాలని పింఛన్ సొమ్ములో కొంత భాగం అక్కడ ఇచ్చేలా స్థానికులతో కలిసి మాట్లాడారు. ఇక మధ్యాహ్నం స్థానిక పాఠశాలలో తింటుంది. ఈమె పదేళ్లుగా క్రిష్టిపాడులోనే ఉంటుంది.

తిక్క శీను..

వలంటీర్ మహేశ్వరి నుంచి ఫింఛన్ సొమ్మును అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి మానసిక వికలాంగుడు. ఇతని తల్లి లక్ష్మమ్మ చిన్నతనంలోనే చనిపోవడంతో తండ్రి చెంత పెరిగాడు. పుట్టుకనుంచే మానసికంగా బాధపడుతున్న శీను తండ్రి ఈశ్వర రెడ్డి కూడా ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆదరించేవారు లేరు...అన్నం పెట్టేవారు అరకొరగా ఉన్నారు. బంధువులు ఉన్నప్పటికీ శీను వారి వద్దకు సరిగ్గా వెళ్లడు. ప్రతి నెలా రూ.3000 పింఛన్ సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నాడు. ఇతన్ని గ్రామంలో తిక్క శీను అని పిలుస్తారు. రేషన్‌కార్డు ద్వారా నెలనెలా బియ్యంతో పాటు ఆరోగ్యశ్రీకార్డు, వైఎస్సార్ బీమా కార్డులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. అంతేకాదు క్రిష్టిపాడు గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో 51వ నంబర్ ప్లాట్‌ను కూడా ఇటీవల ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి పట్టాను మంజూరు చేసింది.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



గోవిందపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె, కామినేనిపల్లె, శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగు నీరు, ర్యాంప్‌ల ఏర్పాటుపై తహసీల్దార్ కులశేఖర్‌తో ఆరా తీశారు. కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు షామియాలను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రథమనందీశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): మాఘమాసం పురస్కరించుకొని నాల్గవ సోమవారం శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. ప్రథమనంది, బ్రహ్మనందీశ్వరస్వామి, సోమనందీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, నాగనందీశ్వర దేవాలయాల్లో మల్లికార్జునస్వామి, తదితర శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భీమలింగేశ్వర ఆలయంలో శ్రీశైల పాద యాత్రికులకు అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రథమనందీశ్వర ఆలయంలో సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ జరిపించారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

నంద్యాల టౌన్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు డిపోల నుంచి శ్రీశైలం, మహానంది, సంగమేశ్వరం, ఓంకారం, యాగంటి, రుద్రకోడు తదితర శైవ క్షేత్రాలకు 165 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం సాధారణ బస్సు చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు తోపుడుబండ్ల రవాణా నిషేధించామన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. నిరంతరం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచడానికి, ఘాట్ రోడ్డులో బస్సుల మరమ్మతు కోసం మొబైల్ టీమ్స్ సిద్ధంగా ఉంటాయని, అవసరమైన స్పేర్ పార్ట్స్‌తో పాటు అనుభవజ్ఞులైన మెకానిక్‌లు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే 16 మంది అధికారులు, 110 మంది సిబ్బందితో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వివరించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆళ్లగడ్డ: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సోమవారం ఎంపీడీఓ రమణారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పంచాయతీల వారీగా సెక్రటరీలు, సర్పంచులు, ఎంపీటీసీలతో నీటి సమస్యపై సమీక్ష చేపట్టారు. వారు చెప్పిన సమస్యలను నోట్ చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పంచాయతీ సెక్రటరీలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. బోర్లకు, మోటార్లకు మరమ్మతులు చేయించుకోవాలని, అవసరమైన బోర్లలో మరిన్ని పైపులు దించాలని ఆదేశించారు. ఈ మూడు నెలలు నీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో గ్రామస్తులతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్ పాల్గొన్నారు.



సభ్యుల సమస్యలను వింటున్న ఎంపీపీ, అధికారులు